కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

ఖలీల్‌వాడి, మార్చి 12 : తమ సమస్యలను పరిష్కరించడంతోపాటు వివిధ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడి, వేసవి సెలవులు, గతంలో సమ్మె సందర్భంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం దుర్వినియోగం కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంపై మండిపడ్డారు. టీచర్లు హెల్పర్లను దొంగలుగా ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందడంలేదు..

- కోటగిరి తహసీల్దార్ ఎదుట రైతుల ఆవేదన

తహసీల్దార్ సునీతతో మాట్లాడుతున్న ఆయకట్టు రైతులు

కోటగిరి, మార్చి 12: నిజాంసాగర్ కాలువల ద్వారా విడుదల చేస్తున్న సాగునీరు చివరి ఆయకట్టుకు అందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోటగిరి జైనాపూర్ శివారులో పంటలు సాగుచేస్తున్న రైతులు మంగళవారం తహసీల్దార్ సునీత ఎదుట తమ గోడును వెళ్లబుచ్చారు. అధికారుల నిర్లక్ష్యంతో తమ పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఇందుకు తహసీల్దార్ స్పందించి సమస్యను పరిశీలిస్తానని రైతులకు ధైర్యం చెప్పారు.

మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్సీకి వినతి

ఖలీల్‌వాడి, మార్చి 12 : చాలా రోజులుగా స్థిర నివాసాలు ఏర్పర్చుకొని ఉంటున్న పలు కాలనీ వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఇండ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అధికారుల వేధింపులను అరికట్టి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ద్యారంగుల కృష్ణ ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 25 గొర్రెలు మృతి

వినాయక్‌నగర్, మార్చి 12: నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 25 గొర్రెలు మృతిచెందాయి. మహారాష్ట్ర నుంచి డీసీఎంలో 150 గొర్రెలను హైదరాబాద్‌కు తరలిస్తుండగా కంఠేశ్వర్ బైపాస్ సిగ్నల్ వద్ద వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో 25 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. కారులో ప్రయాణిస్తున్నవారికి కూడా గాయాలయ్యాయని ఎస్సై మహేశ్ తెలిపారు.

మహిళలు మనోధైర్యాని కోల్పోవద్దు

ఫస్ట్‌క్లాస్ అదనపు మెజిస్ట్రేట్ ఖుష్బూ ఉపాధ్యాయ

వినాయక్‌నగర్, మార్చి 12: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలల్లో రాణిస్తున్నారని, ఎన్ని కష్టాలు ఎదురైనా మనోధైర్యాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని ఫస్ట్ క్లాస్ అదనపు మెజిస్ట్రేట్ ఖుష్బూ ఉపాధ్యాయ సూచించారు. ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకొని, దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మంగళవారం మహిళా పోలీస్ సిబ్బంది ఏర్పాటుచేసిన ఉమెన్స్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన సిబ్బందికి బహుమతులను అందజేశారు. అనంతరం సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రొబేషనరీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ తేజిత, ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి కేక్ కట్‌చేస్తున్న మెజిస్ట్రేట్ ఖుష్బూ, పాల్గొన్న సీపీ కల్మేశ్వర్

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్‌గా హరోన్‌ఖాన్

ఖలీల్‌వాడి, మార్చి 12 : స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్‌గా నగరంలోని 13వ డివిజన్ కార్పొరేటర్ హరోన్‌ఖాన్ నియమితులయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల పలు కార్పొరేషన్లకు కొత్త పాలకవర్గాలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా హరోన్‌ఖాన్‌కు పీసీబీ మెంబర్‌గా అవకాశం దక్కింది. ఈయన ఇటీవలే ఎంఐఎం నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

జిల్లా కవికి జాతీయ పురస్కారం

పురస్కారం అందుకుంటున్న శ్రీమన్నారాయణాచార్య

సుభాష్‌నగర్, మార్చి 12 : నగరానికి చెందిన హిందీకవి శ్రీమన్నారాయణాచార్యకు జాతీయ పురస్కారం దక్కింది. మార్చి 10న అయోధ్య చారుశీల జానకీ ఘాట్ సమీపంలో అఖిల భారత కవిసమ్మేళనం నిర్వహించగా, శ్రీరాముడి ఆగమనం, రామ్‌లాల్లా ప్రతిష్ఠాపన తదితర అంశాలతో రూపొందించిన కవితను శ్రీమన్నారాయణ చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను కావ్యప్రాణ్ పురస్కారంతో గౌరవించారు.

అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తే చర్యలు: డీఈవో

ఖలీల్‌వాడి, మార్చి 12: ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ అనుమతి లేకుండా అడ్మిషన్లు, క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కార్పొరేట్ పాఠశాలల పేరిట 2024-25 విద్యా సంవత్సరానికి కొన్ని సంస్థలు అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలిసిందని, విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి అడ్మిషన్లు తీసుకోవద్దని సూచించారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ఇందల్వాయి, మార్చి 12 : అడవులను కాపాడడం అందరి బాధ్యత అని ఇందల్వాయి ఎఫ్ఆర్వో రవిమోహన్ భట్ అన్నారు. ధర్పల్లి సెక్షన్‌లోని మద్దుల్ అటవీ ప్రాంతంలో అడవుల సంరక్షణపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. కొందరు అడవులకు నిప్పుపెడుతున్నారని దీనిని అడ్డుకోవాలని సూచించారు. అడవులు అంతరిస్తే కలిగే అనర్థాలను వివరించారు. రేంజ్ పరిధిలోని 20-30 చిరుతలు ఉన్నట్లు గుర్తించామని, వీటితోపాటు అనేక వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉందన్నారు. అటవీప్రాంతం వెంబడి రహదారులపై ప్రయాణించే వాహనదారులు వన్యప్రాణులకు హాని కలుగకుండా నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు అసిపుద్దీన్, శ్రీనివాస్, సెక్షన్ అధికారులు బాపురావు, ఆనంద్, సురేందర్, బీట్, స్టాయికింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి భగత్‌సింగ్ వర్ధంతి సభలు

డిచ్‌పల్లి, మార్చి 12 : భగత్‌సింగ్ 93వ వర్ధంతి సభలను ఈనెల 15 నుంచి 31వరకు నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ తెలిపారు. టీయూలో రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్లతో కలిసి వర్ధంతి సభల పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మోసం చేశారని, ప్రశ్నించే గొంతుకలపై ఉప చట్టాలను ప్రయోగిస్తున్నారని, ఎన్నికల నేపథ్యంలో సీఏఏ తీసుకువచ్చారని, వీటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతంకుమార్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర రచనల్లో వాస్తవాలపై 17న ఉపన్యాసం

సుభాష్‌నగర్, మార్చి 12 : ఇతిహాస సంకలన సమితి ఇందూరు ఆధ్వర్యంలో భారతదేశ చరిత్ర రచనల్లో వక్రీకరణలు- వాస్తవాలు అనే అంశంపై ఈ నెల 17న సాయంత్రం న్యూ అంబేద్కర్ భవనంలో ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలో చరిత్రకు ఎర్రతెగులు పుస్తకావిష్కరణ తదితర ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

చెరుకు రైతులతో నేడు కలెక్టర్ ముఖాముఖి

సారంగాపూర్, మార్చి 12 : సారంగాపూర్ చక్కెర కర్మాగారం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు చెరుకు రైతులతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఐకేఎంఎస్ నాయకులు ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రైతులతోపాటు ఉత్పత్తిదారుల సంఘం నాయకులు, వాటాదారులు పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి 'ప్రేరణ' పోటీలు

డిచ్‌పల్లి, మార్చి 12 : టీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న కామర్స్ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి తెలంగాణ కామర్స్ అసోసియేషన్, యూనివర్సిటీ కామర్స్ విభాగం సంయుక్తంగా ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య రాంబాబు గోపిశెట్టి తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 14 నుంచి 18 వరకు కళాశాల స్థాయి, 20న యూనివర్సిటీ స్థాయి, 23న రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించి బ్రోచర్లను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరితో కలిసి మంగళవారం ఆవిష్కరించారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి

మోస్రా (చందూర్), మార్చి 12: మోస్రా మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు అధ్యక్షతన మంగళవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జడ్పీటీసీ విజయా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ధరణి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నాయబ్ తహసీల్దార్ సాయిలుకు సూచించారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతుల పక్షాన పోరాడుతామన్నారు.

సంక్షిప్తంగా..

ధర్పల్లి వారసంత వేలం.. ధర్పల్లి, మార్చి 12 : మండల కేంద్రంలోని వారసంతకు స్థానిక జీపీ కార్యాలయంలో మంగళవారం వేలం నిర్వహించగా, యాకుబ్ అనే వ్యక్తి రూ. 3.50లక్షలకు దక్కించుకున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సైపుద్దీన్ తెలిపారు. రోజువారీ సంతకు జీపీ లక్ష్యం (రూ.2.53లక్షలు) మేరకు ధర రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు చెప్పారు.

14న 'ఢిల్లీ పిలుపు'.. డిచ్‌పల్లి, మార్చి 12 : ప్రధాని మోదీ, బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలని, రైతులకు ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని కోరుతూ ఈ నెల 14న ఢిల్లీ పిలుపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూమన్న, దాసులు తెలిపారు. రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

డిచ్‌పల్లిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి.. డిచ్‌పల్లి, మార్చి 12 : డిచ్‌పల్లి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ఘన్‌పూర్ వీడీసీ సభ్యులు కోరారు. గూడ్స్ షెడ్ ప్రారంభోత్సవం సందర్భంగా రైల్వే జీఎంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఫుట్ ఓవర్, అండర్ పాసింగ్ బ్రిడ్జిలు నిర్మించాలని విన్నవించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు సాయినాథ్, గణేశ్ రెడ్డి, తేజ, విజయ్, ఎంపీటీసీ సవిత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు భూమి పూజ.. మోస్రా (చందూర్), మార్చి 12: మోస్రా మండలం గోవూర్ గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు జడ్పీటీసీ విజయా భాస్కర్ రెడ్డి, ఎంపీపీ ఉమా శ్రీరాములు మంగళవారం భూమిపూజ చేశారు. డబుల్ బెడ్ రూం కాలనీకి తాగునీరు సరఫరా చేసేందుకు రూ.3.2 లక్షలతో పనులను చేపట్టినట్లు వారు తెలిపారు. అనంతరం గ్రామంలో మరియమ్మ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం.. చందూర్, మార్చి 12: మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్‌ను ఎంపీపీ లావణ్యా రాంరెడ్డి స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయారెడ్డి, సొసైటీ చైర్మన్ అశోక్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలువ వైపు వెళ్లొద్దు.. చందూర్, మార్చి 12: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాలువ ద్వారా ఆయకట్టు పంటలకు సాగునీరు విడుదల చేస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శాంత సూచించారు. నీటి ప్రవాహ వేగం ఎక్కువగా ఉన్నదని కాలువ వైపు వెళ్లొద్దని హెచ్చరించారు.

ఉపాధి పనుల తనిఖీ.. ధర్పల్లి, మార్చి 12: మండలంలోని సల్లగరిగె అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో బాలకృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. కూలీల హాజరు, పనుల వివరాలను తెలుసుకున్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రం తనిఖీ

దరఖాస్తు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

భీమ్‌గల్, మార్చి 12: ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. మంగళవారం భీమ్‌గల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సేకరిస్తున్న దరఖాస్తుల వివరాలను ఎంపీడీవో సంతోష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్‌లను అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీలత, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఆర్ఐ ధనుంజయ్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో గంగామోహన్, ఎంఈవో స్వామి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి

ఏర్గట్ల, మార్చి 12: అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు జక్కని మధుసూదన్‌తోపాటు ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని, అధికారులు తమకు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని నిలదీశారు. ఇక ముందు పొరపాట్లు జరగకుండా చూస్తామని అధికారులు అన్నారు. తహసీల్దార్ యూసుఫ్ మాట్లాడుతూ.. భూ సమస్యలున్న రైతులు, రేషన్ కార్డు సమస్యలున్న ప్రజలు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బట్టాపూర్ మాజీ సర్పంచ్ కట్కం పద్మాసాగర్‌రెడ్డి, నాగేంద్రనగర్ మాజీ సర్పంచ్ మంజుల బాలాజీ గౌడ్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. సమావేశంలో గుమ్మిర్యాల్ ఎంపీటీసీ సభ్యుడు శంకర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీవో శివచరణ్, ట్రాన్స్‌కో ఏఈ సురేశ్, అటవీశాఖ అధికారి తుకారాం రాథోడ్, మండల వైద్యాధికారిణి ప్రసన్నప్రియ, ఏఈలు వినీత్, సాగరిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, సీఆర్‌పీ మహేందర్, ఏపీవో వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న షేక్ మున్నా

ఆర్మూర్‌టౌన్, మార్చి12: ఆర్మూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా మంగళవారం షేక్ మున్నా బాధ్యతలను స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుడు ఆదేశాల మేరకు వైస్ చైర్మన్ షేక్ మున్నాకు ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. అనంతరం షేక్ మున్నా మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందజేస్తున్న ఇఫ్కో ప్రతినిధులు

ఇఫ్కో ఆర్‌జీబీ మెంబర్‌గా రేగుంట దేవేందర్

మోర్తాడ్(కమ్మర్‌పల్లి), మార్చి12: ఇఫ్కో ఆర్‌జీబీ మెంబర్‌గా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి కమ్మర్‌పల్లి సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్ ఎన్నికయ్యారు. ఆయనకు ఇఫ్కో ప్రతినిధులు మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. కమ్మర్‌పల్లి సొసైటీ చైర్మన్ ఆర్‌జీబీ మెంబర్‌గా ఎన్నికైన సందర్భంగా పాలకవర్గం శుభాకాంక్షలు తెలిపింది.

వ్యాపారుల సిండికేట్.. వేలం రేపటికి వాయిదా

నవీపేట,మార్చి 12: వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో నవీపేట సంత వేలాన్ని అధికారులు వాయిదా వేశారు. నవీపేట మేకల, కూరగాయల సంతకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రవీందర్ నాయక్ అధ్యక్షతన మంగళవారం వేలం నిర్వహించారు. ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణల హాజరయ్యారు. గతేడాది మేకల సంతకు రూ. 55 లక్షల 16 వేలు వేలం పలికింది. ఈ ఎడాది కేవలం రూ. 39 లక్షలకు వ్యాపారి సిరాజొద్దీన్ వేలంపాట పడారు. అంతకంటే ఎక్కువ పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. వారాంతపు కూరగాయల సంతకు వేలం గతేడాది రూ.15 లక్షలు పలికింది. ఈ ఏడాది ఐదుగురు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. వీరిలో సిరాజ్ రూ.లక్ష వేలం పాడి ఆగిపోయాడు. గతేడాది కంటే తక్కువ ధర రావడంతో మేకలు, కూరగాయల సంత వేలాన్ని ఈనెల 14కు వేలం వాయిదా వేస్తున్నట్లు కార్యదర్శి ప్రకటించారు. మరో రెండు సార్లు నిర్వహించే వేలంలో కనీస ధర రాకపోతే కలెక్టర్ సూచన మేరకు కనీస ధరను తగ్గించే అవకాశముంది. ఇలా జరిగితే నవీపేట గ్రామ పంచాయతీ ఆదాయానికి రూ. 30 లక్షల వరకు గండి పడే అవకాశాలు ఉన్నాయి.

సంక్షిప్తంగా..

- ఆర్మూర్‌టౌన్,మార్చి12: కేంద్రంలో మోదీ సర్కారు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల14న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ కోరారు. పట్టణంలోని మంగళవారం సీపీఎంఎల్, ఏఐపీకేఎస్ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు.
- వేల్పూర్, మార్చి 12: మండలకేంద్రంలో మంగళవారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జాతరను నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.
- రెంజల్, మార్చి 12: వీరన్నగుట్ట గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వీరభద్ర స్వామి ఉత్సవాలు మంగళవారం ముగిసినట్లు అర్చకుడు నాగ్‌నాథ్ అప్పా తెలిపారు. మహారాష్ట్ర తరదితర ప్రాంతాల భక్తులు వచ్చి పూజలు నిర్వహించారని తెలిపారు.
- రెంజల్,మార్చి 12: నంబర్ ప్లేట్లు లేని ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు ఏఎస్సై రవీందర్ మంగళవారం తెలిపారు. సాటాపూర్ తెలంగాణ చౌరస్తాలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ వాహనాలను బోధన్ ఎంవీఐకి అప్పగిస్తామని తెలిపారు.
- ఎడపల్లి, మార్చి 12: మండల కేంద్రం శివారులో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ యార్లగడ్డ శ్రీనివాస్ మంగళవారం పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆందోళన చెందకుండా రాయాలని అన్నారు. ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
- శక్కనగర్/కోటగిరి, మార్చి 12: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పత్రీజీ జన్మస్థల ట్రస్టు సభ్యులు పరీక్ష ఆట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. పొతంగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో పరీక్ష ఆట్టలను పంపిణీ చేశారు.
- భీమ్‌గల్, మార్చి 12: బడాభీమ్‌గల్‌లో కుర్మ పోషన్నకు చెందిన ఇల్లు సోమవారం అర్ధరాత్రి సుమారు 1 గంటకు దగ్ధమైంది. బాధితుడి కథనం.. పోషన్న తన ఇంట్లో నిద్రపోతున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది.
- మోర్తాడ్, మార్చి12: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో శివకృష్ణ జీపీ కార్యదర్శులకు సూచించారు. మోర్తాడ్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎంపీడీవో తిరుమల, ఎంపీవో శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.
- ఏర్గట్ల, మార్చి 12: పదోతరగతిలో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని గల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీవో) వనిత అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ నూతన భవనాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులతో ఆమె మాట్లాడారు. ఆమె వెంట పాఠశాల ఎస్‌వో సుంకరి సంధ్య తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తపస్ ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లిలో మండలంలోని 80 మంది మహిళా ఉపాధ్యాయులను కమ్మర్‌పల్లిలో మంగళవారం సన్మానించారు. తపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి , కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. -మోర్తాడ్, మార్చి12

విద్యార్థులు సూచనలు పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

మోర్తాడ్, మార్చి12: ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని, ఉపాధ్యాయుల సూచనలను పాటించాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాల, కేజీబీవీ, మోర్తాడ్‌లోని కేజీబీవీ, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు సంబంధించి సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంధ్రయ్య, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

రెంజల్,మార్చి 12 : మండల కేంద్రానికి చెందిన వివాహిత గొడ్ల లక్ష్మి (53) ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బాబురావు మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లు నిర్మించేందుకు సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేశారు. ఎలా చెల్లించాలో తెలియక సోమవారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**